సాగునీటిశాఖ కార్యాలయాలు ఏవీ?

- సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు నీటిపారుదలశాఖ పరిధిలో 8 సబ్‌డివిజన్లు మంజూరు
- రెండేళ్లు పూర్తవుతున్నా ఇంకా ఏర్పాటు కాని కార్యాలయాలు



జిల్లాలో ప్రవహించే 71డీబీఎం ప్రధానకాలువ

అర్వపల్లి : రైతులకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం రెండేళ్ల కిందట నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాలను మంజూరు చేసింది. 2021 జనవరిలో తుంగతుర్తి, సూర్యాపేట రెండు నియోజకవర్గాల్లో మొత్తం 8 సబ్ డివిజన్‌లు మంజూరయ్యాయి. తుంగతుర్తి నియోజకవర్గంలో తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం, నూతనకల్ మండలాలకు నాలుగు సబ్‌డివిజన్‌లు.. అలాగే సూర్యాపేట నియోజకవర్గంలో సూర్యాపేట, చివ్వెంల, మోతె, ఆత్మకూర్(ఎస్) మండలాలకు సబ్ డివిజన్‌లు మంజూరు చేశారు. కానీ ఇవి మంజూరై రెండేళ్లు దాటినా ప్రారంభానికి నోచుకోలేదు. ఒక్కో సబ్ డివిజన్‌కు డీఈఈ, నలుగురు ఏఈఈలు, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్ ఉండాల్సి ఉంది. డీఈఈలు ఉండగా ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే అటెండర్లు కూడా నియామకం జరగలేదు. కార్యాలయాలు ప్రారంభం కాకపోవడంతో సిబ్బంది నియామకం కూడా జరగలేదు. అయితే ఈ రెండు నియోజకవర్గాల్లో ఎస్సారెస్పీ రెండవ దశ కింద సుమారు లక్ష ఎకరాల భూములు సాగవుతున్నాయి. అయితే ఆయా మండలాల్లో సబ్ డివిజన్ కార్యాలయాలు లేక రైతులు చిన్న పనికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సబ్ డివిజన్ కార్యాలయాలను ప్రారంభించి సిబ్బందిని నియమించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయాలు ఏర్పాటు చేయాలి



వివిధ మండలాలకు మంజూరైన సబ్ డివిజన్ కార్యాలయాలను వెంటనే తెరిచి సిబ్బందిని నియమించాలి. నీటి పారుదల శాఖ సిబ్బంది అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

త్వరలో ఏఈఈ ఖాళీల భర్తీ



నీటిపారుదల శాఖలో ఏఈఈల భర్తీకి ఇటీవల పరీక్షలు జరిగాయి. ఫలితాలు రాగానే కొత్త ఏఈఈల నియామకం జరగనుంది. సరిపోను సిబ్బంది లేకపోయినా రైతులకు ఏ ఇబ్బంది కలుగకుండా గోదావరి జలాలను పంపిణీ చేస్తున్నాం. కార్యాలయాల ఏర్పాటు, సిబ్బంది నియామకం ప్రభుత్వ స్థాయిలో జరుగాల్సి ఉంటుంది.

- విజయ్‌కుమార్, ఈఈ

వైభవంగా గజవాహన సేవ



గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి గజవాహన సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఏనుగు వాహనంపై ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇంటింటికీ హారతులిచ్చి టెంకాయలు కొట్టారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, కడారి నరేష్, ఈఓ వై.శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు విఖనసచార్యులు, రాంబాబుఅయ్యంగార్, ఆనంద్‌దీక్షితులు, పవన్, సాయిరాం, భక్తులు మామిడాల రాజలింగం, రాగి, అనిల్, చెన్నా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టాలెంట్ టెస్ట్

సూర్యాపేటటౌన్ : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఎగ్జామ్ కోఆర్డినేటర్స్ బి.ఆడమ్, గోళ్లమూడి రమేష్ బాబులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి పరీక్ష ఫీజు లేకుండా ఉచితంగా నిర్వహించే ఈ టాలెంట్ టెస్టులో సూర్యాపేట మండలంలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ టెస్టులో 8, 9 తరగతుల నుంచి తెలుగు, ఇంగ్లిష్ మీడియం వారీగా ఒక్కొక్క విద్యార్థి చొప్పున హాజరు కావాలని, విద్యార్థులు తమ వెంట స్మార్ట్ ఫోన్ తీసుకురావాలని కోరారు.

క్లుప్తంగా

పోలీస్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం : నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న జానకిరాములు అనారోగ్యంతో మృతి చెందడంతో మృతుడి కుటుంబానికి జిల్లా పోలీసు చేయూత పథకం నుంచి సోమవారం ఎస్పీ రాజేంద్రప్రసాద్ రూ. 2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ఉండడం కోసం జిల్లా పోలీసు సంక్షేమం ద్వారా పోలీసు చేయూత పథకాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రామచంద్రగౌడ్, శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

చివ్వెంల : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎల్. లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై నిర్వహించే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

చెరువుల తూములు తెరిస్తే చర్యలు

మద్దిరాల : మండలంలోని గ్రామాల్లో చెరువుల తూములను తెరుస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రభుత్వం ఎస్సారెస్పీ ద్వారా చెరువులు నింపుతుందని తెలిపారు. కానీ పలువురు ఆకతాయిలు తూములను తెరుస్తున్నారని, దీంతో చెరువుల్లోని నీరంతా వృథా అవుతుందని పేర్కొన్నారు. వెంటనే తూములు మూసివేయాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని అన్నారు.

మండల కార్యదర్శిగా పరశురాములు



నియామకపత్రం అందజేస్తున్న నారాయణ

పెన్‌పహాడ్ : గౌడ జన హక్కుల పోరాట సమితి మండల కార్యదర్శిగా మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన బోడ పరశురాములుగౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిత్తలూరి నారాయణగౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర స్వామిగుడి ఆవరణలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యదర్శికి నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మేకపోతుల వెంకటరమణగౌడ్, చనగాని రాంబాబు, చామకూరి సైదులు, మామిడి సర్వయ్య, కుక్కడపు సైదులు, వెంకన్న, వెంకటనారాయణ, చొగాని శ్రీనివాస్‌గౌడ్, బిక్కి బుచ్చయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆశ్రమంలో పండ్ల పంపిణీ



అనాథాశ్రమంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల ఆశ్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఈదుల రమేష్‌చంద్ర తన జన్మదినం సందర్భంగా సోమవారం మానసిక వికలాంగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అనాథాశ్రమంలో కేక్‌కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకుడు ఇటివకాల చిరంజీవి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, చిప్పలపల్లి పరశురాములు, పొన్నాల సృజన్, వంశీ, నిమ్మల శ్రీను, విజయ్, మహేష్, నరేష్, సంపత్, కోటి, రాజు తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు దగ్ధం

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల, గోరెంట్ల శివారులో జాతీయ రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించేందుకు సంబంధిత అధికారులు కూలీలను ఏర్పాటు చేశారు. కానీ ఆ కూలీలు సోమవారం పిచ్చిమొక్కలకు నిప్పు పెట్టారు. దీంతో ఆ మంటలు హరితహారం మొక్కల అంటుకొని పలు చోట్ల మొక్కలన్నీ దగ్ధమయ్యాయి.



పోలుమల్ల శివారులో దగ్ధమైన మొక్కలు

బీసీలకు బడ్జెట్ కేటాయించడంలో నిర్లక్ష్యం



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

తిరుమలగిరి : జనాభా దామాషా ప్రకారం బీసీలకు బడ్జెట్ కేటాయించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు అన్నారు. బీసీలపై నిర్లక్ష్య వైఖరికి నిరసనగా స్థానిక చౌరస్తాలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు రెండు శాతం నిధులు కేటాయించిందని, రాష్ట్ర ప్రభుత్వం 3 శాతం మాత్రమే నిధులు కేటాయించిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను అవమాన పరుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్ గౌడ్, గణేష్, బ్రహ్మ, శ్రీనివాస్, సోమకృష్ణ, సతీష్, కిషన్, లింగయ్య, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



సూర్యాపేట రూరల్ : మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి



నూతనకల్ : మాట్లాడుతున్న నాగం సుధాకర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా సోమవారం మండలంలోని సపావత్ తండా నుంచి రేఖ్యానాయక్ తండా, రామన్నగూడెం మీదుగా బాలెంల గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పక్కా ఇళ్లు, ప్రభుత్వ భవన నిర్మాణాలు, పాఠశాల భవనాలు, రోడ్లు, నీటి ట్యాంకుల నిర్మాణాలు కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే జరిగాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ గట్టు శ్రీనివాస్, బాలెంల సర్పంచ్ రామసాని రమేష్ నాయుడు, చిలుక ఆనంద్, రామకృష్ణ, వేణురెడ్డి, మామిడి రవి, షఫిఉల్లా, స్వామి, నామ ప్రవీణ్, గోపాల్‌రెడ్డి, ఫారుక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీని గడప గడపకూ తీసుకెళ్లేందుకు చేపట్టిన హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కార్యకర్తలను కోరారు. సోమవారం మండల పరిధిలోని అలుగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రకు కొనసాగింపుగా హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఈ యాత్రలో ప్రతి కార్యకర్త పాల్గొని పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అలుగునూరు గ్రామ శాఖ అధ్యక్షుడు బంటు క్రాంతి, బద్రి, ఇటీకాల కుశలవ, ఆకుల రమేష్, బంటు శ్రీను, వెంకన్న, తుంగతుర్తి విద్యాసాగర్‌రావు, ఉప్పుల గంగయ్య, ఆలేటి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో రూ.5లక్షల బీమా



అర్వపల్లి : కొమ్మాలలో ఈ-కేవైసీ నమోదు చేసుకుంటున్న ఉపసర్పంచ్ కుంట్ల రేణుక



నాగారం : ఈటూరులో ఆయుష్మాన్ భారత్ నమోదును ప్రారంభిస్తున్న రాముయాదవ్

అర్వపల్లి : ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా లభిస్తుందని కొమ్మాల ఉపసర్పంచ్ కుంట్ల రేణుకగోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆమె ఆయుష్మాన్ భారత్ ఈ-కేవైసీ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆరోగ్యశ్రీ లబ్ధిదారులంతా ఆయుష్మాన్ భారత్‌లో ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ కేంద్ర నిర్వాహకుడు సూరారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాగారం : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌కే యువ భారత్ ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాముయాదవ్ అన్నారు. ఆర్‌కే యువ భారత్ పౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఈ-కేవైసీ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా పేద ప్రజలకు ఉచిత, మెరుగైన వైద్యం అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద 1,350 రకాల రోగాలకు ఉచితంగా చికిత్సలు అందిస్తారని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.5లక్షలతో ఉచితంగా వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులందరూ ఈ-కేవైసీ నమోదు చేయించుకొని ఆయుష్మాన్ భారత్ పథకాన్ని పొందవచ్చన్నారు. అనంతరం హెల్త్‌కార్డు ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పేరాల పూలమ్మ సోమయ్య, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎల్లాచారి, కన్నెబోయిన రాములు, సాయిలు, సురేష్, కర్నాటి అంజయ్య, సైదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అల్పాహారం అందించడం అభినందనీయం



అల్పాహారం పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

సూర్యాపేట : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 201 రోజులుగా ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు, వారి సహచరులకు అల్పాహారం అందజేయడం అభినందనీయమని బీఆర్‌ఎస్ నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ చంద్ర, కోశాధికారి రాచకొండ శ్రీనివాస్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు, నాయకులు దూలం నగేష్, పటేల్ నరసింహారెడ్డి, ఎస్‌కే.రఫీ, లక్ష్మీకాంత రెడ్డి, హరి, కుమ్మరికుట్ల లింగయ్య, యుగంధర్, పున్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

తిరుమలగిరి : సీపీఐ తిరుమలగిరి మండల కార్యదర్శి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి సోమిరెడ్డి మృతి సీపీఐకి తీరని లోటని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో సోమిరెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడారు. రైతుల సమస్యలపై పేదల తరఫున అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర సోమిరెడ్డిది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యుడు ఎల్లంల యాదగిరి, కంబాల శ్రీను, ఎం.లక్ష్మయ్య, ప్రభాకర్, కె.మల్లయ్య, ఎక్బాల్, అశోక్, శ్రీకాంత్, కొమురెల్లి, వెంకన్న పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



తిరుమలగిరి : జలాల్‌పురంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ స్నేహలత



చివ్వెంల : గాయంవారిగూడెంలో కంటి వైద్యశిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్

అర్వపల్లి : 18ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం కోరారు. జాజిరెడ్డిగూడెంలో జరుగుతున్న కంటివెలుగు శిబిరం సోమవారం పూర్తయిన సందర్భంగా మాట్లాడారు. గ్రామంలో మొత్తం 2137మందికి కంటి పరీక్షలు చేసి 359మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశామని చెప్పారు. అలాగే 229మందికి అద్దాలకోసం ఆర్డర్ పంపినట్లు తెలిపారు. మంగళవారం నుంచి కాసర్లపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో కంటి వెలుగు కార్యక్రమం మొదలవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మణిదీప్, సీహెచ్‌ఓ చరణ్, ఆప్తమాలజిస్ట్ వేణు, హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, ఏఎన్‌ఎంలు సైదమ్మ, శకుంతల, ఆశ కార్యకర్తలు, కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

తిరుమలగిరి : పద్దెనిమిది సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. సోమవారం తిరుమలగిరి మండలం జలాల్‌పురం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణ చర్యల్లో భాగంగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని మల్లెల వందన, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సర్పంచ్ కొమ్ము వెంకన్న, క్యాంపు డాక్టర్ సమతారాణి, పంచాయతీ కార్యదర్శి రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

గాయంవారిగూడెంలో..

చివ్వెంల : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధిలోని గాయంవారిగూడెం సర్పంచ్ కలకొట్ల సైదులు అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్న పేదవారికి వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అదాని కుంభకోణంపై విచారణ జరపాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : అదాని స్టాక్స్ కుంభకోణంలో ఆదానీపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపీసీ) వేసి విచారణ జరపాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి రాములు డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నరేంద్రమోదీ అండదండలతో అదాని ప్రపంచంలోనే రెండవ కుబేరుడిగా ఎదిగాడని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతల మల్లేశ్వరి, జిల్లా నాయకులు బొమ్మగానే శ్రీనివాస్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి, జిల్లా నాయకులు రేగటి లింగయ్య, దికొండ శ్రీనివాస్, ఎల్‌ఐసీ వెంకటరెడ్డి, హరికృష్ణ, నిమ్మల శేఖర్, వాడపల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న కడియం రామచంద్రయ్య

అర్వపల్లి : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. బీజేపీ భరోసా యాత్రలో భాగంగా జాజిరెడ్డిగూడెంలో సోమవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ గ్రామగ్రామాన బీజేపీ భరోసా సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బూత్‌లవారీగా గ్రామంలో సభలు జరిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బీఆర్‌ఎస్ 9ఏళ్ల పాలనలో పేదలకు పూర్తిగా అన్యాయం జరిగిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చలిగంటి వీరేందర్, మల్లెపాక సాయిబాబా, నియోజకవర్గ కన్వీనర్ కాపా రవికుమార్, మాజీ జెడ్పీటీసీ పేరాల పూలమ్మ, కూరాకుల వెంకన్న, మండల అధ్యక్షుడు పగిళ్ల శంకర్, కూర శంకర్, పాక వీరేష్‌యాదవ్, జిన్నె అశ్విన్, మారపాక రాములు, బట్టమేకల రాంమల్లు, కీర్తి వెంకటేశ్వర్లు, బింగి రమేష్, హబీద్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ రద్దు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నూతనకల్ : మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల విషయంలో నాణ్యత ప్రమాణాల గురించి ప్రశ్నించిన వారి పట్ల అసభ్య పదజాలం వాడిన కాంట్రాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి లైసెన్స్ రద్దు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్ మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోసేబదులు పెద్ద పెద్ద రాళ్లను వేయడంతో రహదారికి అనుసంధానంగా ఉన్న లింకురోడ్లు, సీసీ రోడ్ల వద్ద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయమై రహదారికి ఇరువైపులా సీసీతో స్లోప్ నిర్మాణం చేపట్టాలని కోరిన న్యూడెమోక్రసీ కార్యకర్తలను కాంట్రాక్టర్ అసభ్య పదజాలంతో దూషించాడని ఆరోపించారు. అధికారులు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించాలని, నాణ్యత పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంటా నాగయ్య, పెద్దింటి రంగారెడ్డి, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, పోతెబోయిన కిరణ్, దేసోజు మధు, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గద్దం శ్యామ్, మున్నా మధు పాల్గొన్నారు.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేటటౌన్ : ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఎస్సీ నిరుద్యోగులకు అందిస్తున్న గ్రూప్స్ కోచింగ్ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.దయానందరాణి, డైరెక్టర్ సీహెచ్.రాములు, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏఓకు వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : 2022 అటవీ సంరక్షణ నియమాలను ఉపసంహరించుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ఆదివాసులకు ఇచ్చిన హక్కులను ఈ అటవీ సంరక్షణ నియమాలు హరించి వేస్తున్నాయన్నారు. ఈ ధర్నాలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. లక్ష్మయ్య, బొడ్డు శంకర్ జిల్లా నాయకులు పెద్దింటి రంగారెడ్డి, సంపేట కాశయ్య, మేకల కనకారావు, వల్లపుదాసు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో సమస్యలకు పరిష్కారం

మద్దిరాల : ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ అమీన్‌సింగ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశానుసారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఈ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వికాస్ పాటిల్, వివిధ శాఖల అధికారులు శ్రీకాంత్, శివకృష్ణ, హరికృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత ఆవశ్యకతపై ఇంటింటా ప్రచారం

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో భగవద్గీత ఆవశ్యకత, హిందూ ధర్మ గొప్పతనం, ఆధ్యాత్మిక గ్రంథాల గురించి ఇంటింటి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హిందూ జ్ఞానవేదిక త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఇందుశ్రీ వీరయ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత జ్ఞానాన్ని ఆచరించడం ద్వారా కర్మ విధానం తెలుసుకొని మోక్షం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు భవాని, అశోక్, వీరయ్య, నాగమణి, ప్రవీణ్, నక్షత్ర, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

పెన్‌పహాడ్ : గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ అన్నారు. సోమవారం అనాజిపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో గత ప్రభుత్వాలు సర్వే నంబర్ 53లో సుమారు 7 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పేదలకు పట్టాలు ఇచ్చి నేటి ప్రభుత్వం పట్టాలు రద్దు చేసి పేదల నోట్లో మట్టి కొట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కపాక ముత్తయ్య, లింగయ్య, వెంకన్న, రాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల గ్రామానికి చెందిన పోతుగంటి శేఖర్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్ సోమవారం మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.